# గురువా అదీ విషయం

( నాటిక )

రచన : శంకరమంచి పార్థ సారథి

పాత్రలు

| | | |
|---|---|---|
| 1. | మూర్తి | 50 సం ॥ |
| 2. | ఇందిర | 45 సం ॥ |
| 3. | హనుమంత రావు | 40 – 45 |
| 4. | రాఘవ రావు | 40 – 45 సం ॥ |
| 5. | విశ్వనాధం | 50 సం ॥ |
| 6. | దొంగ | 30 – 35 సం ॥ |

# గురువా అదే విషయం

## ( నాటిక )

రచన : శంకరమంచి పార్థ సారథి

**తెర తీసే సరికి**

( అదో మధ్య తరగతి ఇంట్లో డ్రాయింగ్ రూమ్ – టీచర్ ఇందిర టవలు భుజనా వేసుకుని లోపలి గదిలోంచి అక్కడికి వచ్చింది. అక్కడ భర్త మూర్తి కనిపించకపోతే వీధిలో వున్న భర్తని పెద్దగా పిలిచింది )

ఇందిర : ఏవండోయ్....మిమ్మల్నే ...ఎక్కడా

మూర్తి : ( కంగారుగా వస్తూ ) ఆ ... వస్తున్నా...ఇక్కడే వున్నాగా దేనికా కేకలు.

ఇందిర : దేనికా.. మీరు వున్నారో...పారిపోయారో తెల్సుకుందామని నాకు స్కూల్‌కి వెళయి ఛస్తోంది...

మూర్తి : దానికి నేనేం చెయ్యను ? ఇది మరీ బాగుంది...స్కూలుకి టైం అవుతోంది అంటే అవుతుంది మరి... కాలం మనగురించి ఆగమంటే ఆగుతుందా !

ఇందిర : అయ్యిందా ! పనిమనిషి ఇంకా రాలా

మూర్తి : అదా ! ఏం కంగారుపడకు కాస్త లేటుగా రమ్మని నేనే చెప్తా.

ఇందిర : ఏవిటీ ...లేటుగా రమ్మని చెప్పారా...అంటే నే స్కూలుకి వెళ్ళాకా దాంతో వెధవ్వేషాలు వేద్దామనా .....

మూర్తి : నా బతుక్కి అదొక్కటే మిగిలింది ముచ్చట...లక్షణంగా పాతికేళ్ళు మాట పడకుండా సర్వీసు చేశా....ఆ రోజు...ఆరోజు...

ఇందిర : ఏంటి మళ్ళీ ఫ్లాష్ బ్యాకా... విని విని విసుగుపుట్టి ఛస్తోంది... ముష్టి వెయ్యిరూపాయిలు లంచం తీసుకుంటూ ఆ టి.వి వాళ్ళకి దొరికిపోయారు.

మూర్తి : అసలు లంచం అడిగింది ఆ దొరస్వామిగాడు... మూర్తికిచ్చిపోండి అన్నాట్ట. వాళ్ళొచ్చి నా జేబులో పెట్టుంటే టి.వి.కవరేజ్ ....ఆనక సస్పెన్షన్

ఇందిర : అబ్బబ్బ ...నాతల దిమ్మెక్కి ఛస్తోంది. ఈ రోజుల్లో లంచం తీసుకోవడం తెలీదు అంటే మామూలుగా నవ్వరు. నాకు టైం లేదు... అలా వెళ్ళి పనిమనిషి గారు వస్తుందేమో చూడండి... మిమ్మల్నే

మూర్తి : ఆ ! వెడుతున్నా ...అయినా చూడడం దేనికి ! చూడకపోతే రాదా ?

ఇందిర : ఏంటి గొణుక్కుంటున్నారు... నే స్నానానికి వెడుతున్నా ...ఆవిడ గారొస్తే ముందు అంట్లు తోవమని చెప్పండి..

( మూర్తి బయటికెళ్ళాడు...ఇందిర లోపలికి వెళ్ళబోగా సెల్‌ఫోన్ రింగయింది...ఇందిర కాల్ రిసీవ్ చేసుకుంది. చాలా కావాల్సిన వాళ్ళతో మాట్లాడుతున్నట్లు వుత్సాహంగా మాట్లాడుతోంది )

ఇందిర : హల్లో ! సార్ గుడ్ మార్నింగ్ మీరా ! బాగానే వున్నాం ...మీరెలా వున్నారు...అవున్సార్ మీకెవరు చెప్పారు ? రత్నామేడమా ! ( మూర్తి వచ్చాడు )

మూర్తి : ఎక్కడా కనుచూపుమేరలో లేదే....

(ఇందిర ఫోన్ మాట్లాడుతూనే మూర్తికి అంట్లు తోమెయ్యమని సంజ్ఞలు చేస్తోంది)

ఇందిర : మా పిల్ల స్టేట్స్‌లో వుంది కదా ..అక్కడి కుర్రాడే ...మంచి ఫ్యామ్లీ...విశ్వనాధం గారని బాగా వున్న వాళ్ళు..అంతా దాని అదృష్టం...థాంక్స్ సార్. ఏమాట పలుకు రాకుండా పెళ్ళి ఎలా చేసి పంపిస్తానో అని దిగులుగా వుంది. మా వారా ....వున్నారనుకోండి ...మీరెప్పుడొస్తున్నారూ... ఓకే ...అలాగే...థాంక్స్

( ఫోన్ కట్ చేసింది...కూర్చున్న మూర్తిని చూసింది )

ఇందిర : కూర్చున్నారేంటండి

మూర్తి : భార్య ఫోన్ మాట్లాడుతున్నప్పుడు భర్త బంట్రోతులాగా పక్కన నిలబడితే బావుండదని – అవునూ ఫోన్ మాట్లాడుతూ ఇలా ఇలా సంజ్ఞ చేశావ్...అంట్లు తోవమనా ?

ఇందిర : అప్పుడే తోమేసారా...

మూర్తి : అంట్లు తోవమంటున్నావో ...వండమంటున్నావో అర్ధం కాక స్పెసిఫిక్ ఆర్డర్స్ తీసుకుని ప్రొసీడ్ అవుదామని వెయిట్ చేస్తున్నాను

ఇందిర : పిచ్చి పిచ్చి మాటలు మాట్లాడి నా మూడ్ పాడుచేయకండి.... నేస్నానం చేసి స్కూల్‌కి పోతా... వండుకుంటారో హొటల్లో తింటారో మీ ఇష్టం...

( రుస రుసలాడుతూ లోనికి వెళ్ళిపోయింది ) అంతలో లాయరు హనుమంతరావు లుంగీతో పిచ్చి కుక్క వెంటపడ్డట్టు పరిగెత్తుకుంటూ వచ్చాడు.)

మూర్తి : హనుమంతరావ్ ...ఆ పరుగేంటయ్యా ...లుంగీ వూడిపోగల్దు ...లుంగీతో పరుగు చాలా రిస్కు...

హనుమంతరావ్ : ఓర్నీ రిస్కు పాడుగానూ చెప్పేది విను... అలా వీధిలోకి వెళ్ళి... మీ కోలిగ్ దొరస్వామి గాని ఇలా వస్తున్నాడేమో చూడు..

మూర్తి : అంటే నీలా లుంగీతోనా...

హనుమంతరావ్ : కాదయ్యా ! నాగురించి మీ ఇంటిగ్గాని వస్తున్నాడా అని... ఒక వేళ వస్తే ..నేనిక్కడికి రాలేదని చెప్పు...అవునూ... దాక్కోడానికి మంచి ప్లేసుందా....

మూర్తి : జనరల్‌గా నేనెప్పుడూ బాత్‌రూంలో దాక్కుంటూ వుంటా ...అటక వుంది గానీ నిచ్చెన లేదు.

హనుమంతరావ్ : అయితే బాత్‌రూం ఎక్కడ ?

మూర్తి : ఆగాగు... మా ఆవిడ స్నానం చేస్తోంది....

హనుమంత : ఇప్పుడెలాగయ్యా మరి....

( ఇంతలో బయటనించి మూర్తీ...మూర్తీ ...అని పిలుపు వినిపించింది...హనుమంతరావులో కంగారు అధికం అయ్యింది )

మూర్తి : కంగారు పడకు నే మేనేజ్ చేస్తాగా....

( మూర్తి బయిటికి వెళ్ళాడు... హనుమంతరావుకి అతని మాటమీద నమ్మకం కుదరక దాక్కోటానికి అనువైన స్థలం గురించి అటూ ఇటూ చూశాడు మంచి ఆలోచన వచ్చింది... కట్టుకున్న లుంగీ విప్పేసి ఒక మూలన కప్పుకుని కూర్చుని టీపాయ్ మీద వున్న ఫ్లవర్‌వాజ్ తలపైన పెట్టుకుని కదలకుండా కూర్చున్నాడు. అంతలో స్నానం చేసిన ఇందిర సుప్రభాతం వల్లిస్తూ అక్కడిక వచ్చింది. మూల కూర్చున్న హనుమంతరావుని చూసి బియ్యం మూట అనుకుంది )

ఇందిర : షాపువాడు బియ్యం పంపించినట్టున్నాడు.... ఈయనకి ఒకసారి చెబితే అర్థం కాదు.... బియ్యం వాడొస్తే మూట ఆ మూల వేయించండి ఇక్కడ అడ్డంగా వుంటుంది అని చెప్పిచచ్చినా. మళ్ళీ ఇక్కడే వేయించారు.... బియ్యం మూట మీద ఫ్లవరు వాజు ఎవడైనా పెట్టుకుంటాడా....

( ఫ్లవరు వాజ్‌ని తీసేసి తిరిగి టీపాయ్ మీద పెట్టింది )

ఇందిర : బియ్యం బావున్నాయో లేదో చూసుకోవడం మంచిది... నెలంతా తిన లేక ప్రాణం పోతుంది.

(అంటా లోపలికి వెళ్ళింది... ఇది గమనించిన హనుమంతరావు ఒక్క గెంతులో వెళ్ళి ఇందిర చెప్పిన మూల లుంగీ కప్పుకుని కూర్చున్నాడు ఇంతలో మూర్తి లోపలికి వచ్చి హనుమంతరావు కనిపించకపోవడంతో వెర్రి చూపులు చూస్తుండగా ఇందిర ఒక పళ్ళెం గ్లాసు పట్టుకుని వచ్చి, మూట స్థలం మారిన సంగతి గమనించి ఆశ్చర్యంగా చూస్తోంది.

ఇందిర : మన పెళ్ళైన ఇన్నేళ్ళళ్ళో పని చెప్పగానే ఇట్టే చేయడం ఇదే ప్రదమం ..అవునూ ...ఆ మొహం ఏంటి అలా పెట్టారూ...

మూర్తి : హనుమంతరావేడి...

ఇందిర : ఏ హనుమంతరావు ?

మూర్తి : మన లాయరు హనుమంతరావు. దాక్కోడానికి ప్లేసడిగాడు... బాత్ రూంలో ఖాళీ లేదని చెప్పా... అవునూ ఈ మూటేమిటి ?

ఇందిర : ( కోపంగా ) హనుమంతరావు దాక్కున్నారు..

( మూర్తి వెళ్ళి లుంగీ లాగేడు )

మూర్తి : నిజంగా హనుమంతరావేనే... ఓరి ...నీ ఆసాధ్యం కూల ఇదేం పనయ్యా...

ఇందిర : నే బియ్యం బస్తా అనుకుని ఆ మూల వేయించారని విసుకున్నా

హనుమంత : అది వినే పొజిషన్ మార్చా.... అవునూ...ఆ దొరస్వామిగాడు వెళ్ళినట్టేనా....

మూర్తి : అసలతను నిన్ను చూసినట్టు లేదు... అనవసరంగా కంగారు పడ్డావ్... టీచర్ మీకు స్కూల్ టైం అయినట్టుంది.... ( ఇందిర లోపలికి పరిగెత్తింది )

మూర్తి : అవునయ్యా ...ఆ దొరస్వామిని చూసి ఇంత భయపడుతున్నావు.. అప్పున్నావా...

హను : అప్పా నా బొందా... ఆ మధ్య ఓ లాండ్ గ్రాబింగ్ కేసులో ఇరుక్కుని నా దగ్గరకొస్తే జాలిపడి కేసు టేకప్ చేసా... ఫీజు కింద కోర్టు ఖర్చుల కింద పాతికవేలిచ్చాడు...

మూర్తి : అవునూ ఆ కేసు కాంప్రమైజ్ అయ్యిందిగా.....

హను : అదే ప్రాబ్లమ్...ఆ పాతికవేలు వాపస్ ఇవ్వమని బెదిరింపులు ఇందాక సెలూన్ ముందు కుర్చుని వుంటే రావడం చూసి ఇలా వచ్చేసా....

మూర్తి : అదా సంగతి ఆ దొరస్వామిగాడి వల్ల కాదూ నే సస్పెండ్ అయింది... అయినా లంచం అడిగిన వాడు తను తీసుకోకుండా నాకిమ్మనడం ఏవిటి ?

( ఇందిర అక్కడికి వచ్చి )

ఇందిర : బుద్దీజ్ఞానం లేకుండా వాడంటే తీసుకోవడానికి మీకు వుండొద్దు... ఆ డబ్బు నాకెందుకిస్తున్నారని అడగొద్దు...

హనుమం : మీరేం కంగారు పడకండి... రేపు ఈ పాయింటు పట్టుకుని వాదించి పారేసి కేసు కొట్టేసేలా నేచేస్తాగా...

ఇందిర : ఏమో పిల్ల పెళ్ళి లోపు ఈయన డ్యూటీలో చేరితే గౌరవంగా వుంటుంది.

హనుమంత : ఏవిటీ ..మీ పిల్ల పెళ్ళి సెటిలయిందా....

మూర్తి : అవునయ్య అమెరికా సంబంధం ఈ నెల్లోనే పెళ్ళి...

ఇందిర : ఏవండీ చీటీపాటకి మూడో సంతకం కావాలిగా....ఎవరన్నా తగిలారా...

( మూర్తి రహస్యంగా మనుమంతరావుని చూపించి సంజ్ఞ చేశాడు )

అయితే సరే వుండండి నే కాఫీ తెస్తా...

హను : వచ్చేవారం కేసు వాయిదా గుర్తిందిగా ఓ ఐదు వేలు రెడీ చెయ్యి....

మూర్తి : మళ్ళీ అయిదు వేలా ఇప్పటికి యాభైవేలయింది... నా వల్ల కాదు ... శిక్షవేస్తే.... వెళ్ళి జైల్లో కూర్చుంటా....

హను : టి.విలో కవరేజీలు చూసి జైలంటే ఏంటో అనుకుంటున్నావ్ అక్కడా డబ్బులతోనే పని !

మూర్తి : అయితే...

హను : అయితే ఏంటయ్యా ...అల్లుడు అమెరికాలో మావ చర్లపల్లి జైల్లో.... ఛండాలంగా వుంటుంది.... ( ఇందిర కాఫీ కప్పుతో వచ్చింది )

ఇందిర : ఏవండీ రెడీనా...

మను : ఆయన రెడీ అంటే మాత్రం మనం చూస్తూ చూస్తూ ఎలా పంపిస్తామమ్మా ...తప్పుకదూ.... ఎంతయినా మొగుడు మొగుడే

ఇందిర : మీరు అంటున్నదేమిటో...

మూర్తి : నీకర్థం కాదుగానీ ...ఆ పని నే చూస్తా... నువ్వు స్కూల్‌కి బయల్దేరు ..

( ఇందిర లోపలికి వెళ్ళింది )

హను : పనంటున్నావ్...అయిదు వేల గురించేగా...త్వరగా చూడు... అవునయ్యా ఆ రాఘవరావుని ఒక మాట అడిగి చూడకూడదూ ?

( రాఘవరావు ప్రవేశించాడు )

రాఘ : అంతా విన్నాలెండి... రాఘవరావంటే మీకంటికి ప్రపంచ బ్యాంకులాగా కనిపిస్తున్నాడు... పీక్కు రావడమే గానీ తిరిగి చెల్లించేది లేదూ....

హనుమం : అంటే అ్రెడీ...

రాఘ : యాభై వేలు – మాట్లాడవేమాయ్య...

మూర్తి : మీ మంచితనం తల్చుకుంటే నా గొంతు మూగపోతోంది... అలా కుర్చోండి....

రాఘవ : కుర్చోను విషయం చెప్పు ...ఎప్పుడిస్తావ్... పదినెలలయింది... వడ్డీలేదు అసలు లేదు...

మూర్తి : ( హను మంతరావుతో ) మీరెళ్ళిరండి...మనం తర్వాత మాట్లాడుకుందాం.

హనుమం : అలాగే మరి...నువ్వా పన్లో వుండు...

( హనుమంతరావు వెళ్ళిపోయాడు )

మూర్తి : రాఘవరావ్ నా పరిస్థితి నీకు తెల్సుగదా... జీతం లేదు... సహాయం చేసావ్ కాదనడం లా... కాస్త ఓపికి పట్టావంటే డ్యూటీలో చేరంగానే నీ డబ్బు నీకు పువ్వుల్లో పెట్టి ఇస్తా...

రాఘవ : అవసరం లేకపోతే అలాగే ఆగేవాడ్ని... కానీ ఇల్లు మొదలుపెట్టా.... నాకు డబ్బులు చాలా అవసరం ...నువ్వేం చేస్తావో నాకనవసరం...

( అంతలో ఇందిర అక్కడికి వస్తూ )

ఇందిర : ఏవండీ ఆగ్యాసు కంపెనీకి ఫోన్ చేశారా.... గ్యాస్ లీకవుతోంది... మెకానిక్‌ని పంపమని గట్టిగా చెప్పండి.

మూర్తి : మూడు సార్లు చేశా... ఇదిగో పంపిస్తున్నాం...అదిగో పంపుతున్నాం అంటున్నారు.

రాఘవ : నమస్కారమండి...నా పేరు రాఘవరావు...

ఇందిర : నమస్కారం...

మూర్తి : నా కుమంచి ఫ్రెండు...ఈ పని నీవల్ల కావాలి అంటే చేసి పెట్టేస్తాడు...

ఇందిర : అలాగా ...మీరేం చేస్తుంటారు...

రాఘవ : అడ్డమైన వాళ్ళకి అప్పులిచ్చి లాక్కోలేక పీక్కోలేక బాధపడుతుంటా...

ఇందిర : అంటే కొంపతీసి మావారిగ్గానీ అప్పిచ్చారా ...ఏవండీ మాట్లాడరేం...ఆయన కేవన్నా డబ్బులివ్వాలా...( రాఘవరావు, మూర్తి ఒకరి మొహాలు ఒకరు చూసుకుంటున్నారు. )

ఇందిర : ఏవిటి ఇద్దరూ మాట్లాడటం లేదు... పైగా మొహాలు చూసుకుంటున్నారు... నిజం చెప్పండి... మిమ్మల్నే...

రాఘవ : ఏం చెప్పమంటారమ్మా... కడుపు చించుకుంటే కాళ్ళమీద పడుతుంది...

మూర్తి : ఆ సగంతి తెలసి కూడా చీల్చుకోవడం దేనికయ్యా... బుద్దిలేక...నేనేం అప్పులు చెయ్యలేదే... ఫ్రెండ్లీగా వచ్చాడు అంతే ....

ఇందిర : ఏవండీ అంతేనా ...మావారి మాటలపైన నాకు నామ్మకం తక్కువ లెండి అందుకని.

రాఘవరావు : హు... అరవమంటే కప్పకి కోపం..వదలమంటే పాముక్కోపం

మూర్తి : మనవాడు తెలుగు సామెతల్లో మంచి దిట్ట కొత్త కొత్త సామెతల్ని కనిపెడుతూ వుంటాడు. ఆ మధ్యన ఒకటి అలా విసిరాడు... అత్తని కొడితే ...గిత్తకి తగిలిందని అంటూ.

ఇందిర : అత్తని కొడితే గిత్తకి తగిలిందా... అదేం సామెత దిక్కుమాలిన సామెత... ఏం లేదు అన్నయ్యగారూ ఈ మనిషికి తెలివితేటలు లేవు...రూపాయి సంపాదించడం తెలీదు... ఎంతమంది ఎన్ని రకాలుగా సంపాదించుకోవడం లేదు చెప్పండి... అర్బన్ బ్యాంకులు, ఆలయభూములు, నకిలీ విత్తనాలు, ఎరువుల్లో మోసాలు, ద్రోహాలు, వెన్నుపోట్లు... ఎన్ని లేవు చెప్పండి... కనీసం సన్మానాలు చేసి వెనకేసుకోవచ్చు... ఏవంటారు...

మూర్తి : అవన్నీ స్కూల్లో గాంధీ గారి గురించి పాఠం చెప్పినంతతేలిక కాదు కదా... పెద్ద వాళ్ళ ఆశీస్సులు, అండదండలు వుండాలి.

ఇందిర : ఎవరండి పెద్దవాళ్ళు ...అంతా ఈ విధంగానేగా పెద్దవాళ్ళయ్యింది.

మూర్తి : రాఘవరావు ఏవిటీ ...అయినా వుండి ఏమిటి లాభం... అప్పిచ్చిన వాడు అరిటాకు లాంటి వాడు...తీసుకున్న వాడు ముల్లువెధవ..

ఇందిర : బాగా చెప్పారు...వాడిక్కోపం వచ్చినా మనం తొందర పడ్డా మనకే నష్టం.

రాఘవ : అందుకే గదమ్మా నోరు మూసుకుని మూగ వెధవలా వుండిపోయింది...

మూర్తి : ఎందుకయ్యా పాత సినిమాల్లో పెరుమాళ్ళు టైపులో బరువు డైలాగులు ...మనం ఫ్రెండ్స్‌మి.... ఫ్రెండ్లీగా మాట్లాడుకోవాలిగానీ... అలా కుర్చో....అన్నట్టు మొన్న మన క్లాస్‌మేట్ సంజీవరావు... జూలో కనిపించాడు...

రాఘ : ఏ సంజీవరావూ...

మూర్తి : అదేనయ్యా...ఆ వయసులోనే హిస్టరీ టీచర్ని ప్రేమించాడూ....

ఇందిర : ఏవిటా పిచ్చి మాటలు సిగ్గు లేకుండా...

(కోపంగా లోపలికి వెళ్ళింది )

మూర్తి : హమ్మయ్య ..రాఘవరావు చాలా థాంక్సు ..పరువు కాపాడావు... ఏం లేదయ్యా నే చేసిన అప్పు ఎప్పటికైనా నేనే తీర్చాలి అనేది నా సిద్ధాంతం.

రాఘవ : నీ సిద్ధాంతాలకు అప్పిచ్చినవాడి జీవితం బలికాకుండా చూడు...

మూర్తి : భలేవాడివే... అలాంటి భయలేవీ పెట్టుకోకు... అవునూ ఈ మధ్యన మనిషివి కాస్త తగ్గినట్టు కనిపిస్తున్నావ్.....

రాఘవ : నీలాంటి వాళ్ళకు అప్పులిచ్చాక తగ్గక కలరు, కంద ఎలా వస్తాయ్... ( అంతలో సెల్ మోగింది... ) సార్ గుడ్ మార్నింగ్ వచ్చేస్తున్నా సార్...అలాగే ...బయల్దేరుతున్నా...

మూర్తి : ఎవరూ...

రాఘవ : మా బాస్ ఈ మధ్యన ఒక కోటీశ్వరుడి దగ్గర పి.ఎ.గా చేరా... వాళ్ళబ్బాయి పెళ్ళి. అది హడావిడి ...సరే నే వస్తా... ఇదిగో చూడు పోన్లే పాపం అని ఆవిడ ముందు పరువు కాపాడా... ఈ సహనం, సైలెన్స్ కలకాలం వుండవు... నోరు తెరిచానో గొడవైపోతుంది... జాగ్రత్త...వస్తా ...( వెళ్ళిపోయేడు )

మూర్తి : గొడవలైపోతాయట...ఇలా మాట్లాడితే పువ్వులాంటి అప్పుదార్ని రాయిలా తయారుచేస్తారు... అప్పుచేసినవాడు మనిషి కాడా... వాడికి ఫీలింగ్సుండవా. మోషన్సు, ఎమోషన్సు రాకూడదా... దర్టీ ఫెలోస్... అప్పుదార్ల ఆత్మగౌరవ పరిరక్షణ సమితి అని ఎవరన్నా మొదలు పెడితే బాగుండు...

ఇందిర : ఏంటీ మీలో మీరే గొణుక్కుంటున్నారు....

మూర్తి : అబ్బే ఏం లేదే... అమ్మాయి పెళ్ళి గురించి ఆలోచిస్తున్నా...

ఇందిర : అమ్మాయి పెళ్ళి గురించి మీరు ఆలోచిస్తున్నారా .... అయితే స్కూలుకి శెలవే...

మూర్తి : అదేం...

ఇందిర : పెద్దావాడెవడో హరీమంటాడుగా ...అవునండీ మనక్కాబోయో అల్లుడుగారు మా ఫాదర్ మిమ్మల్ని కాంటాక్ట్ చేస్తారని చెప్పి వారం అవుతోంది.. ఆ పెద్ద మనిషి ఇంకా రాలేదు....

మూర్తి : ఎంతైనా మనం ఆడపిల్ల వాళ్ళం ...మనం వస్తామని కూర్చున్నాడేమో ?

ఇందిర : ఫోనెంబరిచ్చాడు... ఎన్నిసార్లు చేసినా ఈ నెంబరుతో ఏ టెలిఫోను పనిచేయటలేదు అనే వస్తోంది...

( ఇంతలో విశ్వనాథం చేతిలో వాటర్ బాటిల్‌తో జబ్బు మనిషిలాగా గుండె చేత్తో పుచ్చుకుని లోపలికి వచ్చాడు )

విశ్వనాథం : ఎక్స్‌క్యూజ్‌మీ... లోపలికి రావచ్చా...

మూర్తి : రండి...మీరూ...

విశ్వనాథం : చెప్తా... ఇలా కూర్చోవచ్చా...మూర్తి కూర్చోండి... కూర్చోండి...

ఇందిర : ఏంటి కూర్చోండి...హార్ట్‌పేషెంట్‌లాగా వుంది...మిమ్మల్నే

విశ్వ : మీరేం అనుకోపోతే కాస్త ఫ్యాన్ ఆన్ చేస్తారా.... సడన్‌గా గుండెలో దడ మొదలైంది...మెడిసిన్స్ ఇంట్లో వుండిపోయాయి.

మూర్తి : అరెరె... కాస్త చల్లటి మంచినీళ్ళు తాగండి... ప్రాణం కుదుటపడుతుంది...

విశ్వ : ఇవి మంచినీళ్ళు కాదు... హెూలీ వాటర్ .... గ్లాసుడు నీళ్ళిప్పించండి...

ఇందిర : ఏవండి...

మూర్తి : ఏవిటే...

ఇందిర : హార్టుపేషెంట్స్ ఏ క్షణంలో ఏమిటో ...మనం కెందుకొచ్చిన పెంట... తీసుకెళ్ళి ఆటో ఎక్కించండి....

విశ్వ : చెల్లెమ్మగారేదో అంటున్నారు...

మూర్తి : మా భయాలు మావి..పెళ్ళి జరగాల్సిన ఇల్లు...రంగులు, సున్నాలు వేయించి రెండు రోజులు కాలా... మరి మీరు శంకరాభరణం క్లైమాక్స్ ఇక్కడ జరిపిస్తే సెంటిమెంటల్‌గా బాగుండదని నా వైఫ్ ఫీలింగ్.

ఇందిర : ఆయనతో మీటింగేంటి...మీరు బజారు కెళ్ళాలి..గుర్తుందా...రడీ అవ్వండి...

మూర్తి : బజారు కెళ్ళాలా....దేనికి...

విశ్వ : అలా అంటే నే వెళ్ళి పోతానని ఆవిడ ఫీలింగ్...కంగారుపడకమ్మా...నాకేం భయంలేదు... అవునూ నువ్వేం చేస్తుంటావ్...

ఇందిర : చేతకాని మొగుడితో సంసారం చేస్తుంటా....గుండె దడగా వున్న పెద్ద మనిషివి నోరు మూసుకుని కూర్చో, వెధవ ఆరాలు, ఎంక్వైరీలు ...ఏవండీ ఆయన్ని త్వరగా సాగనంపండి...మీతో పనుంది ( కోపంగా వెళ్ళిపోయింది )

విశ్వ : అమ్మో ఫైర్ బ్రాండే...

మూర్తి : పది నిముషాలకే ఇలా అంటున్నారు...పాతికేళ్ళుగా ఈదుకొస్తున్నా..ఏమిటో మీరెవరో ఏమిటో తెలియకపోయినా మీ ఫేసు చూస్తుంటే నిజాలు కక్కేయాలనిపిస్తోంది...

విశ్వ : అదే నాకు కావలసింది... కక్కిపారేయండి... మనసు మల్లెపువ్వై పోతుంది... కొంచెం పుచ్చుకుంటారా...

మూర్తి : మందా ....అబ్బో మీరు మొబైల్ దేవదాసన్నమాట...

విశ్వ : ఏం నీకు అలవాటు లేదా....

మూర్తి : కమిటెడ్ డ్రింకర్ని కానండి...అప్పుడప్పుడు రహస్యంగా ...

విశ్వ : ఫైర్‌బ్రాండ్‌కి తెలీకుండా ....ఓకే...నువ్వేం చేస్తుంటావ్ ..జాబా..

మూర్తి : గవర్నమెంట్ జాబ్... అకారణంగా ఏసిబికి దొరకిపోయా...

విశ్వ : ఓహో....సస్పెన్షన్లో ఉన్నావా !

మూర్తి : నా గురించి అడుగుతున్నారు...మీ సంగతులేం చెప్పరేం...

విశ్వ : నా గురించి నీకు తర్వాత తెలుస్తుంది... ఒక్క మాటలో చెప్పాలంటే హేపీగా లైఫ్‌ని ఎంజాయ్ చెయ్యాలనేది నా ఫిలాసఫీ. అప్పులు చేసైనా సరే సుఖాన్ని ఫుల్లుగా పొందాలి. ఈ విషయంలో నా సెకండ్ వైఫ్ గొప్పగా ఎంకరేజ్ చేస్తుంది... నీక్కూడా రహస్యంగా సెకండ్ ఫ్యామ్లీ...

మూర్తి : నా ఫేసుకి అంత అదృష్టమా.... ఏదో పడ్డ చోటే వెతుక్కోవాలని ఇలా లాగించుకొస్తున్నా.... ( ఇందిర వచ్చింది )

ఇందిర : ఇంకా పంపించలేదా... మిమ్మల్నే...

( ఇంతలో విశ్వనాథం సెల్ రింగయింది )

విశ్వ : ఎక్కడున్నావ్... నీకోసం వెయిట్ చేసి చేసి బయల్దేరి వచ్చేసా... వచ్చేయ్... ఆ స్ట్రీట్‌లోనే లెఫ్ట్ సైడ్ థర్డు హౌస్, త్వరగారా మా పి.ఎ.కంగారు మనిషి....

మూర్తి : మీకు పి.ఏ నా అయితే మీరేం చేస్తుంటారు...

విశ్వ : చెప్తాగా... అంతా చెప్తా... ఇల్లు సొంతమా....

ఇందిర : ఆ సొంతమేనయ్యా... సొంతమే... ఏం టాక్స్ గాని వేస్తావా... గుండెదడ మనిషిలా లేవు మాటలు...గుఢచారి ప్రశ్నల్లా వున్నాయ్... అడిగేవాడికి లేకపోతే చెప్పేవాళ్ళకన్నా వుండాలి బుద్ధీ, జ్ఞానం...

మూర్తి : సర్, ఇహ మీరు బయల్దేరండి...ఇంకా ఆలస్యం చేస్తే ఇద్దర్నీ జాయింట్‌గా వుతికి ఇస్త్రీ చేస్తుంది....

విశ్వ : అదేంటి వుతికి ఆరెయ్యాలిగా....

మూర్తి : ఆరేస్తే పారిపోతావని డైరక్టు ఇస్త్రీ....

విశ్వ : ( నవ్వి ) నీకు సెన్సాఫ్ హ్యూమర్ బాగా వుంది... ఇక్కడికవ వచ్చాక నచ్చిన విషయం ఇదొక్కటే... ( అంతలో రాఘవరావు రొప్పుతూ వచ్చాడు.... ఈ యింట్లో ఆయన్ని చూసి ఆశ్చర్యపోయాడు )

రాఘవ : సార్ ...మీరు ...ఇక్కడ....

విశ్వ :  ఏం వుండకూడదా... ఇదేం  నారాయణగాడి సారా కొట్టా  ..నల్లమల అడివా...
మూర్తి : నీకు వీరు తెలుసా...  గుండెదడగా  వుందని వచ్చి రిలాక్సయ్యారు....
రాఘు : సార్ అంటే మీ అబ్బాయి పెళ్ళి...
విశ్వ : చెప్తాగా....  అవునండీ రామచంద్రమూర్తి అంటే మీరేనా...
మూర్తి : అవున్సార్...మీరు
విశ్వ : అమెరికాలో వున్న జ్యోత్స్న మీ పిల్లేగా...
మూర్తి : అవును అయితే...
విశ్వ : మీ పిల్లని చూసి ఢాంమ్మని ప్రేమలో పడ్డ అశోగ్గాడి ఫాదర్ని ...పేరు విశ్వనాధం..
మూర్తి : ఆ... ( అంటా గుండె పుచ్చుకుని కుర్చీలో కూలిపోగా విశ్వనాధం, రాఘవరావు కంగారు )
మూర్తి : గుండెలో  నాకు దడగా ఉంది...
విశ్వ : వాటర్...  వాటర్ తెప్పించు... క్విక్...
రాఘవ : అమ్మగారు ..మంచినీళ్ళు ...త్వరగా ( ఇందిర నీళ్ళగ్లాసుతో పరిగెత్తుకుంటూ వచ్చింది )
ఇందిర :  ఏమైందండి ...ఎలా వుంది...మిమ్మల్నే...
( రాఘవరావు నీళ్ళు అందించగా  మూర్తి నీళ్ళు తాగి లేచాడు )
మూర్తి : ఆయనెవరో  తెల్సా... మనక్కాబోయే  వియ్యంకుడు గారు... పేరు విశ్వనాధం ... నా భార్య పేరు  ఇందిర ...వృత్తి టీచరు....
ఇందిర : నమస్కారమండి అన్నయ్యగారు... మీ మొహం చూడగానే అనిపించింది కావాల్సినవాళ్ళు అని... గుండె దడ అన్నారు తగ్గిందా... అమృతాంజనం రుద్దించమంటారా...
విశ్వ : ఏం వద్దు... మేనేజర్...
రాఘు : సార్...
మూర్తి : ఆయన దగ్గర నువ్వు పి.ఏనా....
విశ్వ : ఇంకా సీను అర్ధం కాలేదా.... ఓకే... పాయింట్లోకి వద్దాం... మావాడు మీ పిల్లని ఫుల్లుగా ప్రేమించాట్ట. తను లేకపోతే బతకలేట్ట... ఇక్కడగాని అందుబాటులో వుండుంటే తలుపు వెనక పెట్టి నొక్కి పారేసివుండేవాడ్ని ...అలా చూస్తూ నిలబడతారే ...కూర్చోమని అనరేం....

మూర్తి : కూర్చోండి...ఇందాకటి నుంచి కూర్చునే వున్నారు గదాని...

విశ్వ : ఆ కూర్చోడం వేరు...ఈ కూర్చోడం వేరు.... ఓకే..తల్లిలేని పిల్లాడు... వాడికోసం ఈ సంబంధం సరే అన్న....కానీ ఒక్క విషయం...నే చాలా కరెక్టు మనిషిని ...అబద్దాలు చెప్పటాలు, అప్పులు చెయ్యటాలు ఇలాంటివి గిట్టవు....తేడా పాడాలొస్తే... షేక్ చేసి పారేస్తా... మీ గురించి కొంత తెల్సుకున్నాను...ఇంకా ఇవి కాక చెప్పనివి... చెప్పాల్సినవి చెప్దామా వద్దా అని ఆలోచిస్తున్నవి ఏమన్నా వుంటే హానెస్టుగా చెప్పేయండి...

ఇందిర : మీకు తెలియనివి ఏం వుంటాయి.... మధ్య తరగతి సంసారం జీతాలపై ఆధారపడి బతికే వాళ్ళం... పిల్లని కష్టపడి చదివించుకుని అమెరికా పంపించాం.

విశ్వ : అదే నా కొంప ముంచింది... ప్రేమట..ప్రేమ ...మేనేజర్.. మావాడు ఇక్కడా వుంటే ఏం చేసేవాడ్ని...

రాఘవ : తలుపు వెనక పెట్టి నొక్కి పారేసేవారు....

విశ్వ : కాదు... ఫ్రిజ్‌లో పెట్టి మూత వేసుండేవాడ్ని ఓకే... మనం సరే అనుకుని తాంబూలాలు మార్చుకోవడానికి మీరు మా యింటికి రావాలి... నావి చాలా కండీషన్లు వున్నాయ్.... నే చెప్పినట్టు నాకు నచ్చినట్టు పెళ్ళి చేయగలరన్న నమ్మకం నాకు రావాలి... అప్పుడే ముహూర్తాలు పెళ్ళి ...అర్థమైందా...మేనేజర్...

రాఘవ : సార్...

విశ్వ : మావాడికి ఇంకో సంబంధం వచ్చింది. పద వాళ్ళింటికి వస్తా....

**---- లైట్స్ ఆఫ్ ----**

**---- లైట్స్ ఆన్ ----**

ఇందిర సోఫాలో కూర్చుని వుంది... మూర్తి ఆవేశంగా పచార్లు చేస్తున్నాడు...కాసేపు అతని వాలకం చూసి గమనించి చివరికి కోపంగా...

.

ఇందిర : బండలు అరిగిపోయినట్టు ఎంత సేపు ఆ పచార్లు. అలా కూర్చుని నా ప్రశ్నకి సమాధానం చెప్పండి...

మూర్తి : అమ్మాయి పెళ్ళి ఖర్చుల కింద ఎంతిస్తారు అని అదేగా నీ ప్రశ్న...

ఇందిర : అయినా పిల్ల పెళ్ళి జరిపించాల్సింది మీరు కాదూ ... మంచి సంబంధం వచ్చింది అప్పో సొప్పో చేసి కార్యం జరిపిద్దాం.... అన్న తాపత్రయమే లేదు... నా వల్ల కాదని కాళ్ళు చాపుకు కూర్చుంటే, ఆడదాన్ని ఎంతని చావను....

మూర్తి : వుద్యోగంలో వుంటే ఏ పిఎఫ్‌లోనో తీసుకుని వుండేవాడ్ని .. సస్పెన్షన్లో వున్నవాడికి అప్పుమాత్రం ఎవరిస్తారు ?

ఇందిర : అంటే మీరనేది ఏమిటి ? నా వల్ల కాదు నీ చావు నువ్ చావమని అంతేనా !

మూర్తి : అంతకన్నా ఏం చెయ్యమంటావో చెప్పు ...పోనీ అప్పిచ్చేవాడ్ని చూపించు . ఎంత వడ్డీ అయినా సరే తీసుకుని నీ చేతికిస్తా...

ఇందిర : అప్పిచ్చేవాడ్ని నేనే చూపించాలి...నేనే మాట్లాడాలి... సంతకం చెయ్యడానికి పెన్నుకూడా నేనే ఇవ్వాలి... చివరకి కాళ్ళు చాపి నావల్ల కాదు అంటే అప్పు నేనే తీర్చాలి .. ఖర్మా ... నా ఖర్మా కొద్దీ దొరికారు....

మూర్తి : అదే నే అనుకుంటున్నా...

ఇందిర : చేతకానప్పుడు చేతకానట్టు వుండాలండి... నా వొళ్ళు మండిపోతోంది...

మూర్తి : సరే నే చేతకాని చవటని ...నన్నొదిలెయ్...

ఇందిర : అదొక్కటే మిగిలింది ముచ్చట... వొదిలెయ్యటం సిగ్గులేకపోతే సరి...
( అంతలో హనుమంతరావు వచ్చాడు )

మూర్తి : ఆ వొదిలెయ్యడం కాదు ...మనీ మ్యాటర్స్ నే చెప్తున్నది...

హనుమం : నమస్కారమండీ... పెళ్ళి దగ్గర పడుతోంది... పనులు ఎలా సాగుతున్నాయ్.. మూర్తీ డబ్బు తప్ప ఏ రకమైన సహాయం కావాలన్నా నే రెడీ... ( ఇద్దరు సీరియస్సుగా కూర్చుండడం గమనించి తగ్గాడు )
సారీ ! మిమ్మల్ని డిస్టర్బ్ చేశానా... తర్వాత వస్తాలెండి... ( వెళ్ళబోయాడు )

ఇందిర : ఫర్వాలేదు కూర్చోండి... మీకు తెలియని సంగతులేం వున్నాయి గనక...

మూర్తి : అమ్మాయి పెళ్ళికి డబ్బు సర్దుబాటు కాలేదు.... పెళ్ళేమో దగ్గర పడుతుంది... అదీ ప్రాబ్లమ్...

ఇందిర : ఆ విశ్వనాథంగారేమో పెళ్ళి ఘనంగా చెయ్యాలని అదే పనిగా చెబుతున్నాడు...అయిదొందల మందికి భోజనాలట... హొటళ్ళల్లో రూములట, కార్లు...

మూర్తి : లవ్ మ్యారేజీగా మావల్ల కాదని చేతులెత్తేస్తే సరి...

ఇందిర : చేతులెత్తేయడాలు, కాళ్ళు జాపటాలు తప్ప మీకు వేరే మాటే రాదు...

హను : ఆ రేంజీలో పెళ్ళి చెయ్యాలంటే కనీసం మూడు లక్షలన్నా కావాలి.

ఇందిర : అన్నీ పోగుచేసినా మీరు చెప్పిందాంట్లో సగం కూడా లేదు..

మూర్తి : ఇప్పుడేం చెయ్యాలి అదీ ప్రాబ్లం...

హను : అప్పులు చెయ్యడమే...

మూర్తి : కరెక్టే.. ఇచ్చేదెవరని...

హను : అప్పులిచ్చే వాళ్ళు తలుపులు కొట్టుకుంటూ మన ఇళ్ళకి రారయ్యా తిరగాలి... పదిమందిని అడగాలి...

ఇందిర : అలా చెప్పండి... ఇంట్లో కూర్చుంటే అప్పుపుడుతుందా చెప్పండి...

మూర్తి : ఇంట్లో కూర్చోక ఆఫీసు ఓపెన్ చెయ్యమంటావా !

ఇందిర : మీరేం చేస్తారో నాకనవసరం...ఆయన ముందు చెబుతున్నా... పెళ్ళి పదిరోజులుంది... పది రోజుల్లోపల మీరు లక్షతెచ్చి నాకివ్వాలి అప్పులే చేస్తారో మీ వాళ్ళనే అడుగుతారో నాకనవసరం...అలా ఇవ్వకపోతే నే పురుగులమందు తాగి చచ్చూరుకుంటా ...తర్వాత మీ ఇష్టం... ( కోపంగా వెళ్ళిపోయింది )

మూర్తి : ఇదీ పరిస్థితి ... ఏం చెయ్యాలో అర్థం కావడంలా...

హను : నే చెప్తాగా... ఒక్క పాతికవేలు నీవి కావనుకుంటే...లక్షన్నర వచ్చే మార్గం చెప్తా....

మూర్తి :ఏంటి... పేకాట...

హను : ఛ...అదికాదు...లంచం అడిగావని కంప్లయింట్ ఇచ్చిన వ్యక్తి పాతికవేలిస్తే కేసు విత్‌డ్రా చేసుకోవడానికి రెడీగా వున్నాడు...

మూర్తి : అయితే....

హను : కేసు విత్‌డ్రా అయితే డ్యూటీలో జాయినవచ్చు...డ్యూటీలో జాయినయితే పదినెలల సాలరీ డ్రా చెయ్యచ్చు....

మూర్తి : కానీ పాతికవేలు ఎక్కడ్నించి తేవాలి... అదీ ప్రాబ్లం...

( రాఘవరావు మాటని అంది పుచ్చుకుంటూ అక్కడికి వచ్చాడు )

రాఘవ : ఆ ప్రాబ్లమ్‌కి సొల్యూషన్ నే చెప్తాగా...

మూర్తి : విశ్వనాధంగారు వస్తున్నారా...

రాఘవ : కాస్సేపట్లో వస్తారు... ఈలోగా ఒక ముఖ్యమైన న్యూస్ నీకు లీక్ చేసిపోదామని వచ్చా....

మూర్తి : ఏమిటి...

రాఘవ : హనుమంతరావు నీ మనిషే కాబట్టి నో ప్రాబ్లమ్...నీకు లక్ష రూపాయలొచ్చే మార్గం చెబుతా ... మరి నా యాభై వేలు నాకిస్తావా...

మూర్తి : నా పిల్ల పెళ్ళయ్యే...ప్లీజ్ నా పొజిషన్ అర్ధం చేసుకో..అసలే నా వైఫ్ నన్ను పనికిమాలిన వేస్టు పేపర్లా తీసిపారేస్తోంది...

రాఘవ : నాకు లాభం లేనప్పుడు స్వామిద్రోహం మహా పాపం... ప్రపోజల్ క్యాన్సిల్...

హను : మూర్తీ స్వామి ద్రోహం అంటున్నాడు... పెద్ద ప్లానే అయ్యుంటుంది.... వూ అను... లక్షలో యాభై ఇచ్చేసినా యాభై వుంటాయి... పాతిక నాకు కొట్టు. పెళ్ళి లోపల లక్షన్నర నే ఎరేంజ్ చేస్తాగా ...వూ అను...

మూర్తి : ఓకే...నీ అప్పు తీరుస్తా... విషయం చెప్పు...

రాఘవ : ప్రామిస్...

మూర్తి : గాడ్ ప్రామిస్...చెప్పు...

(అంతలో ఇందిర బయిటికెళ్ళడానికి తయారయి వచ్చింది )

ఇందిర : నేనలా బ్యాంక్ దాకా వెళ్ళి అరగంటలో వస్తా.....ఇంట్లో వుంటారా...

మూర్తీ : అలాగే వుంటా...వెళ్ళిరా...

ఇందిర : మా వియ్యంకుడు ఏం అంటున్నాడు....

రాఘవ : ఆయన విషయంలో మీరు చాలా జాగ్రత్తగా వుండాలి. తిక్క మనిషి ...ఎప్పుడు ఏం ఆలోచిస్తాడో చెప్పలేం...

ఇందిర : ఏమాట పలుకు లేకుండా ఈ పెళ్ళి జరిగితే అదే పదివేలు... వస్తానండి... ఏవండి ... ఆ కూరలవాడొస్తే మెంతికూర తీసుకోండి...

మూర్తి : అలాగే... అలాగే... ( ఇందిర వెళ్ళిపోయింది )

రాఘవ : నీ లంచం కేసు, సస్పెన్షన్ గురించి అప్పుల గురించి విశ్వనాధం గారికి తెలిసిపోయింది....

మూర్తి : నిజంగా...

రాఘవ : ఆయన కాస్సేపటిలో మీ ఇంటికొస్తున్నాడు... ఇవినింగ్ ఫ్లయిట్‌కి ఢిల్లీ వెళుతున్నానని చెప్పి లక్షరూపాయలున్న బ్రీఫ్‌కేస్ నీకిచ్చి దాయమంటాడు....

మూర్తి : దాచిపెడతాం...రాగానే తిరిగి ఇచ్చేస్తాం...అంతేకదా...

రాఘవ : అది కాదు...అసలు మేటరు వేరే వుంది.... ఆయన అటు వెళ్ళగానే ఓ దొంగ మీ ఇంటికొచ్చి కత్తి చూపించి ఆ డబ్బు కాస్తా పట్టుకుపోతాడు...

మూర్తి : మైగాడ్...నిజంగానా...

హను : అంటే ఆ దొంగని...

రాఘవ : అదే ట్విస్టు... ఆ దొంగ ఆయన అరేంజ్ చేసిన మనిషే...

మూర్తి : ఎందుకోసం ఇలా చేస్తున్నాడు !

హను : ఇంకా అర్ధం కాలేదా.. ఆ లక్షా కొట్టేసారని ప్రచారం చేసి పెళ్ళి ఆపించేయ్యడానికి...

రాఘవ : అదీ ప్లాను... రాత్రి మందులో వాగేశాడు...

మూర్తి : వరస్టుఫెలో ...మేనర్లెస్ బ్రూట్...రాస్కెల్....

హను : తీరుబడిగా తిడుదువుగానీ కాస్తాగు... అవునూ మూర్తికి లక్షవచ్చే అవకాశం అన్నావ్... అదేంటి ?

రాఘవ : మోసాన్ని మోసంతోనే గెలవాలి... ముల్లుని ముల్లుతోనే తియ్యాలి...

మూర్తి : అలాగే తీద్దాం... విషయం చెప్పు...

రాఘవ : ఆయనొచ్చి ఆ బ్రీఫ్ కేసు ఇచ్చి వెళ్ళగానే దాంట్లో డబ్బు తీసి దాచెయ్... దొంగవస్తాడు... సొమ్ము దొరకదు.. వెళ్ళి ఆ సగంతి ఆయనకి చెప్తాడు... డబ్బుని దొంగవెధవ తీసుకెళ్ళాడని నువ్వు చెప్పు... వాళ్ళిద్దరూ వాళ్ళ చావు వాళ్ళు ఛస్తారు...నీకు లక్ష మిగులుతుంది... యాభై నీకు... యాభై నాకు...

హను : దాంట్లో పాతిక నాకు...వారం తిరక్కుండా డ్యూటీలో జాయినింగ్...ఎరియర్స్ డ్రాయింగ్.. మ్యారేజ్ హ్యాపీగా జరుగుతుంది ఆల్ ఈజ్ వెల్ దట్ ఎండ్స్ వెల్....

మూర్తి : అవునూ.... ఆ పెట్టెలో డబ్బులేదని ఆ దొంగ... చెప్తే మనపైన అనుమానం రాదా..

రాఘవ : వస్తుంది... కాని ఎలా రుజువు చేస్తాడు... చేసిన పాడుపని చెప్పుకోడుగా...

హనుమం : అవును ... చెప్పుకున్నా లా అసలొప్పుకోదు...

రాఘవ : ఏంటి ఆలోచన ...ఒకేనా...

మూర్తి : నాకిష్టంలేదు... ఇది నా నిజాయితీకి పరీక్ష ...మనం చేసిన పని రుజువు చెయ్యలేకపోయినా కావాలంటే పెళ్ళి ఆపించెయ్యగలడు..నో...ఈ పెళ్లి జరగాలి ...సారీ...

హను : అలా కాదు... మరోసారి ఆలోచించు...

మూర్తి : సారీ సారీ సారీ ఒకే...

రాఘ : సరే నీ ఇష్టం... అదృష్టం ఒక్కసారే తలుపు తడుతుంది... నీ బాడ్‌లక్ ...నే చెప్పినట్టు ఆయనతో అనకు నా ఉద్యోగం ఊడిపోతుంది...

మూర్తి : పెళ్ళయ్యేదాకా అప్పుమాట మాట్లాడనంటే నోరు విప్పను...

రాఘవ : బుద్ధిగడ్డి తిని వాగి చచ్చా... ఛీ...ఛీ..

( లేచి ఆవేశంగా వెళ్ళిపోగా ...వెంటనే ఇందిర వచ్చింది )

ఇందిర : ఏంటి ఆయన అంత ఆవేశంగా వెళుతున్నాడు ఏవన్నారు...

మూర్తి : నేనేం అన్లేదే.. త్వరగా లెట్రిన్‌కి వెళ్ళాలట... అందుకని

( ఇందిర బ్యాగు పుచ్చుకుని లోపలికి వెళ్ళింది )

హను : మొత్తానికి మీ వియ్యంకుడు గట్టి ముండా కొడుకే...

మూర్తి : నేనేం తక్కువ తిన్నానా చూడు నాటకం ఎలా నడిపిస్తానో...

హను : నాకో బ్రయిన్ వేవ్ వచ్చింది... సపోజ్ ఈ ప్లానంతా పోలీసులకి చెప్పేసి, నిఘా పెట్టించి ఆ దొంగని అలా రాగానే ఇలా పట్టించేస్తే స్టోరీ మొత్తం బయిటికొస్తుంది... మీ వియ్యంకుడు పరువు డ్రయినేజీలో కల్సిపోతుంది...

మూర్తి : కడుపు మండి కళ్యాణం క్యాన్సిల్ అంటాడు... నేను ప్లాన్‌వేశా... చెప్పనా... ఆయనొచ్చి బ్రీఫ్‌కేసులో డబ్బులు పెట్టి ఇస్తాడుగా ..పెట్టెని దొంగ కంట పడకుండా రహస్యంగా దాచేస్తా... వాడొస్తాడు... వెతుక్కుంటాడు... కనిపించదు... వాడెళ్ళి ఆ మాటే చెబుతాడు... దాంతో ఆయన షాకయి పరిగెత్తుకుంటూ వస్తాడు... మనం వాడి డబ్బు వాడికిచ్చి జరిగింది చెప్పి డబ్బు ఎలా కాపాడింది,..దొంగతో ఎలా ఫైట్ చేసింది.... కమర్షియల్ సినిమా కథలా కల్పించి చెప్తాం... దాంతో మనధైర్య సాహసాలు, నిజాయితీలు పెట్రోలు ధరలాగ ఆకాశం ఎత్తుకు ఎదిగిపోతాయి...ఎలా వుంది ప్లాన్..

హను : బ్రహ్మాండం...దీన్నే ఎత్తుకు పై ఎత్తు, టిట్‌ఫర్ టాట్ అంటారు...

( ఇందిర అక్కడికి వచ్చింది )

ఇందిర : మీరు త్వరగా రెడీ అయితే ఓ గంట బయటికెళ్ళేపనుంది....

మూర్తి : నేరాను మన ఇంటికి విఐపి రాబోతున్నాడు...

ఇందిర : వి.ఐ.పి నా ఎవరాయన...

మూర్తి : నువ్వెక్కడికో వెళ్ళాలన్నావుగా వెళ్ళిరా వచ్చాక... నీకో స్వీట్ న్యూస్ చెప్తాగా... వూ ... బయల్దేరు...

ఇందిర : మీకేమొచ్చినా పట్టుకోలేం... సరే నే వచ్చేసరికి గంటపైనే పట్టొచ్చు. ఇల్లు జాగ్రత్త. ఆ టి.వి చూస్తూ నిద్రపోతారు... తలుపు గడియపెట్టి కూర్చోండి...

మూర్తి : సర్లేవే రాసిపెట్టుంటే రావాల్సిన దొంగ ఎలాగైనా వస్తాడు గానీ నువ్వు పద...హనుమంతరావు నువు కూడా వెడితే నే స్నానం చేసి రడీ అవుతా...

హను : ఏదైనా హెల్ప్‌కావాలంటే రింగ్ చెయ్యి.. నీ వెనక పటిష్టమైన న్యాయ వ్యవస్థ వుందని గుర్తుంచుకో వస్తా....

( మనుమంతరావు వెళ్ళిపోగానే ఇందిర అనుమానంగా )

ఇందిర : అందర్నీ వెళ్ళిపొమ్మంటున్నారు... రెడీ అవుతానంటున్నారు... ఆయనేమో న్యాయం నీ వెనకాలే వుందంటున్నాడు

నిజం చెప్పండి... ఆ వస్తున్న దొంగ మోహంది ఎవరు...

మూర్తి : రామ రామ...ఆ వస్తున్నది ఆడదికాదే మగాడు...

ఇందిర : మగాడా... శివ శివా మీరిలా తయ్యారయ్యారేమిటండి...పరువు పోతుంది...

మూర్తి : పరువేం పోదు... పైగా ఈ దెబ్బతో పెరిగిపోతుంది.. ఆ విశ్వనాధం మనల్ని అప్రదిష్టపాలు చెయ్యడానికి కుట్ర పన్నుతున్నాడు... దాన్ని తిప్పికొట్టే ప్లాన్ ఆలోచించా... నువ్వొచ్చాక అంతా చెబుతాగా... బయల్దేరూ...వూ...

ఇందిర : ఏమిటో నాకేం అర్థం కాకుండా వుంది... అమ్మో టైం అయ్యింది... ఝాన్సీ టీచరు వెయిట్ చేస్తూ వుంటుంది.... వస్తా... ఇల్లు జాగ్రత్త. ( హడావిడిగా వెళ్ళిపోయింది )

మూర్తి : హమ్మయ్య ! విశ్వనాధం అయాం రెడీ యుకెన్ కమ్ నౌ !

( సరిగ్గా అదే టైంకి విశ్వనాధం, ఆ వెనక రాఘవరావు వచ్చారు )

విశ్వ : థాంక్యూ ...అవునూ యింట్లో ఎవరూ లేరా !

మూర్తి : ఫీల్డు ఫ్రీగా వుంటే బెటరుగా వుంటుందని అందర్నీ తోలిపారేసా...

విష్వ : దేనికలా తోలిపారేశావ్..ఏదైనా స్పెషల్ ప్రోగ్రాం గాని వుందా ...

మూర్తి : ఏం తెలియనట్టు ..అమ్మో బావగారూ ఏమో అనుకున్నా  చతురులూ...

విశ్వ : ఏంటో ..నాకేం అర్థం కావడంలేదు.. ఓకే...పాయింట్‌కొద్దాం...మేనేజర్...

రాఘవ : సార్...

విశ్వ : ఆ బ్రీఫ్‌కేస్ ఇలా ఇయ్యి ...నే అర్జెంటుగా ఢిల్లీకి వెళ్ళాల్సివచ్చింది.... అరగంటలో ఫ్లయుటుంది....

మూర్తి : హేపీ జర్నీ...

విశ్వ : ఇది చెప్పించుకోవడానికి కాదు నా ప్రోగ్రాం చెప్పింది... నే వచ్చే వరకు బ్రీఫ్ కేస్ జాగ్రత్త చెయ్యాలి....

మూర్తి : అలాగే వాల్యుబుల్స్ ఏవన్నా వున్నాయా...

విశ్వ : క్యాష్...లక్షరూపాయల క్యాషుంది... మనీతో ట్రావెలింగ్ నాకిష్టముండదు... అంచేత రాగానే తీసుకుంటా ఓకే... ( బ్రీఫ్‌కేస్ మూర్తికిచ్చాడు )

మూర్తి : ఓకే...ఇహ మీరు నిశ్చింతగా వుండొచ్చు...దీని గురించి  మీరు మర్చిపోండి...

విశ్వ : (రాఘవరావుతో ) మర్చిపోవాలిట...  పూర్ ఫెలో ! ఓకే... అవునూ...  నే లోపల లక్షరూపాయలున్నాయని చెప్పాను కదా... నిజంగా వున్నాయో లేవో చూసుకోరా ....

మూర్తి : వుంటాయి... వుండి ..తీరుతాయ్...

విశ్వ : ఏంటో అంత నమ్మకం...

మూర్తి : నో కామెంట్స్...

విశ్వ : నో కామెంట్సా...

మూర్తి : అంతా తెలిసికూడా ఏం చెప్పగూడని పొజిషన్లో ఇలాగే అంటారు... కావాలంటే రాఘవరావుని అడగండి...

రాఘవ : మీకు ఫ్లయిట్‌కి వేళవుతోంది...

విశ్వ : ఓకే... నే వస్తా... రోజులేం బాగా లేవు... క్రైం రేటు బాగా పెరిగిపోయింది... బీకేర్‌ఫుల్ జరక్కూడనిది ఏదైనా జరిగితే...ప్రాబ్లమ్స్ ఫేస్ చెయాల్సి రావచ్చు...

మూర్తి : థాంక్యూ ఫర్ ఎడ్వయిజ్...రాసిపెట్టుంటే ఎంత జాగ్రత్తగా వున్నా జరిగేవి జరక్కమానవ్...ఒక్కసారి గ్యారెంటీగా  జరుగుతాయనుకున్నవి కూడా జరక్కపోవచ్చు..

విశ్వ : అంత ధైర్యం వుంటే ఓకే ...ఇట్సాల్ రైట్ అయితే నే బయల్దేరతా...

మూర్తి : విష్ యు  హేపీ జర్నీ

విశ్వ : థాంక్యూ...మేనేజర్...పద...( ఇద్దరూ వెళ్ళిపోయారు... మూర్తి రిలాక్సింగా, హుషారుగా వున్నాడు )

మూర్తి : లక్ష రూపాయలు...దొంగగారు వచ్చే లోపల...దీన్ని కనబడకుండా దాచేస్తా... ( లోపలికి వెళ్ళాడు.. .వెంటనే బయటినుంచి దొంగ ప్రవేశించాడు... గడ్డం మాసింది...నలిగిన కమర్షియల్ సినిమాల్లో అసిస్టెంట్ రౌడీలా వున్నాడు... చేతిలో కత్తి గూడా వుంది... లోపలికి రాగానే వీధి తలుపు గడియపెట్టి ఇల్లంతా చూసి భయం భయంగా ఒక్కొక్క అడుగేస్తూ లోపలికి ప్రొసీడవుతూ )

దొంగ : హల్లో... మిమ్మల్నే ఇంట్లో ఎవరూ లేరా... మూర్తి లోపలినుంచి వచ్చాడు... సంతోషంగా...

మూర్తి : వచ్చావా... నీ గురించే వెయిటింగు ... రా..రా

దొంగ : చుప్... నేనెవరనుకుంటున్నావ్....ఎందుకొచ్చానో తెలుసా...

మూర్తి : భలేవారే..తెలీకపోవడమేమిటి... ముందే తెల్సిపోయింది... మీరు దొంగ....దొంగతనం చెయ్యడానికి వచ్చారు...అంతేగా...

దొంగ : అసలీ ఇల్లు నీదేనా... నాలాగా నువ్వూ వచ్చావా...

మూర్తి : నే యింటి యజమానిని... కంగారు పడకండి అలా కూర్చోండి కాఫీ...టీ

దొంగ : నీయబ్బ కాఫీ టీ తీసుకోడానికి కాదరా నే వచ్చింది... ఒంటరిగా వున్నావా... వేరే ఎవరన్నా వున్నారా...

మూర్తి : మీకు ఇబ్బంది కలగ్గూడదని అందర్నీ పంపేశా.... ఒక్కడినే ..ఏం టెన్షన్ పడకండి...హేపీగా తాపీగా దోచుకెళ్ళండి...

దొంగ : నీకేమన్నా మెంటలా ? దొంగొచ్చి కత్తి చూపిస్తుంటే కజిన్ బ్రదర్‌తో మాట్లాడినట్టు కబుర్లు చెబుతున్నావ్... నా సంగతి నీకు తెలియదు... మర్యాదగా బీరువా. తాళాలు ఇటివ్వు....

మూర్తి : మీరో క్షణం కూర్చుంటే మనం ఓ ఒప్పందానికొద్దాం... ఇప్పుడు మీరెందుకొచ్చారు...

దొంగ : నీయబ్బ అంతా విని ఇంతా చూసి ఎందుకొచ్చావంటా వేంట్రా...నే దొంగని ...దొంగతనానికొచ్చా....

మూర్తి : కదా... మరి దొంగలు ఏం చేస్తారు...

దొంగ : పొడుస్తా యధవ ...ప్రశ్నలు నువ్వూనూ దొంగలు దోచుకుపోతారు...

మూర్తి : దానికి ముందేం చేస్తారు....

దొంగ : ప్రార్దనా గీతం పాడుకుంటారు... నాకు టైం లేదు... త్వరగా తాళాలివ్వు...

మూర్తి : దేనికంత కంగారు భయం ...మీరెందుకొచ్చారో తెలుసు... వెనక ఎవరున్నారో తెల్సు, మరి పని పూర్తయినట్టు రుజువులు కావాలిగా... అదీ నా పాయింటు ...అంచేత నేనలా కూర్చుంటా కాళ్ళు, చేతులు కట్టేసి నా నోట్లో గుడ్డలు కుక్కు... తర్వాత నీ ఇష్టం..

దొంగ : అమ్మో నిజంగా నిన్ను కట్టేయడమే బెటరు...చూడబోతే చాలా డేంజరు మనిషిలా వున్నావు... తాళ్ళున్నాయ్యా....

మూర్తి : అన్నీ రెడీగా వుంచా... మీరేం వర్రీ కాకండి... ( లోపలికి వెళ్ళి తాళ్ళు తెచ్చాడు )

మూర్తి : ఇవిగో తాళ్ళు ....ఇవిగో కాళ్ళు చేతుల త్వరగా కానియ్యి... ( అని కుర్చీలో కూర్చుని కాళ్ళు, చేతులు అందించాడు... దొంగ కాళ్ళు చేతులు కట్టేసి )

దొంగ :ఇన్ని దొంగతనాలు చేశాగానీ ఈ టైపు కో ఆపరేషన్ ఎన్నడూ చూడలా... ఇప్పుడు చెప్పు... బీరువా తాళాలు ఎక్కడున్నాయ్...

మూర్తి : నీక్కావల్సింది బీరువాలో దొరకదు...

దొంగ : మరెక్కడ దొరుకుతుంది...

మూర్తి : ఎక్కడా దొరకదు...

దొంగ : అంటే ...

మూర్తి : నువ్వెందుకొచ్చావో తెల్సు....ఎవరు పంపించారో తెల్సు... కాబట్టి రెండు గదులు వెతికేసి దొరక లేదని చెప్పు...

దొంగ : దొరకలేదని చెప్పాలా.. ఎవరికి...

మూర్తి : నిన్ను ఈ పనికి పురమాయించిన వాళ్ళకి...

దొంగ : ఏయ్ తమాషాగా వుందా... పొడిచి పారేస్తా.... త్వరగా తాళాలివ్వు...

మూర్తి : బీరువా తాళాలు నా దగ్గరుండవ్... నా వైఫ్ దాస్తుంది.... నాక్కూడా తెలియదు...

దొంగ : చంపేస్తాన్‌రోయ్... తాళాలు లేకపోతే పని ఆగిపోతుందనుకుంటున్నావా... బీరువా బద్దలు కొడతా...( అని మూర్తి నోట్లో గుడ్డలు కుక్కి లోపలికి వెళ్ళాడు )...మూర్తి రిలాక్స్‌గా సినిమా పాట హమ్మింగ్ చేసుకుంటున్నాడు... కాసేపట్లో దొంగ అక్కడికి వచ్చాడు.. వాడి చేతిలో )విశ్వనాథం ఇచ్చిన బ్రీఫ్‌కేస్ ఉంది. త్వరగా బయటపడాలన్న తహతహా వాడిలో కనిపిస్తోంది....ఆ బ్రీఫ్‌కేస్ చూసి మూర్తిలో కంగారు మొదలైంది.... ) దాన్ని తీసికెళ్ళద్దని మూలుగుతున్నాడు...

దొంగ : లక్షరూపాయాలు దొరికాయి నే వెడుతున్నా....

మూర్తి : ( నోట్లో గుడ్డలు ఉమ్మేసి )కనబడకుండా దాచా... ఎలా కనుక్కున్నావ్ ఇదిగో నిన్నే ఆగు... ఏం దొంగవయ్యా... అన్నీ చెప్పి చేయించుకోవాల్సి వస్తోంది.... సామాన్లు కాస్త చిందరవందర చెయ్యి....

దొంగ : నిజంగా నీకు మెంటలే... సరే నీ సరదా నే ఎందుకు కాదనాలి అలాగే...

( సామాన్లు తల్ల కిందులు చేశాడు )

పోలీసు రిపోర్టు ఇచ్చావా తిరిగొచ్చి నరుకుతా ....

మూర్తి : పోలీసులతో పనేముంది... ఇది మన ఫ్యామిలీ ఎఫైర్... వెళ్ళేముందు ...నా జుట్టు పీకి, దవడ ఎర్రబడేలా ఒక్కటి పీకు సీను పర్‌ఫెక్ట్‌గా వుంటుంది...

దొంగ : నిన్ను చూస్తే జాలేస్తుందిరా... గట్టిగా పీకనా...

మూర్తి : వూ... మొహమాట పడకు....

( జుట్టు పీకి, లాగిపెట్టి కొట్టాడు )

దొంగ : సారీ !

మూర్తి : నో...నో...ఇది చాలా ఇంపార్టెంటు...ఇప్పుడు సరాసరి అక్కడికేగా...

దొంగ : ఎక్కడికి...

మూర్తి : అక్కడికి....( ఇపుడు దొంగ జుట్టు పీక్కుని పెద్దగా అరిచి పారిపోయాడు...వెంటనే హనుమంత రావు కంగారుగా ప్రవేశించాడు )

హను : ఆ వెళ్ళింది... దొంగేగా.... అంతా ఓకేనా ప్లాన్ సక్సెస్సా?

మూర్తి : విశ్వనాధం గారు వచ్చేదాకా...నే ఇలాగే వుండాలి ఫోన్ చేసి జరిగింది చెప్పు...

( హనుమంతరావు సెల్‌ఫోన్లో రింగ్ చేసి మాట్లాడుతున్నాడు )

హను : సార్... నేసార్ లాయర్ హనుమంతరావుని .... పెద్ద ప్రమాదం జరిగిపోయింది...మూర్తి ఇంట్లో దొంగతనం జరిగింది.... ( విశ్వనాధం, రాఘవరావులు ఎంట్రీ )

విశ్వ : అలాగా...ఎప్పుడు...

హనుమం : ఇప్పుడే ...మీరు వెంటనే రావాలి...

విశ్వ : వచ్చేశాగా... ( రాఘవరావు, మూర్తికట్లు విప్పాడు )

విశ్వ : అసలేం జరిగింది...ఏం పోయాయ్...

మూర్తి : మీరు చెప్పినట్టే జరిగింది...

విశ్వ : ఆ...

మూర్తి : అదేనండి నేరాలు ఘోరాలు పెరిగిపోయాయ్ అన్నారుగా... మీరలా వెళ్ళారు... వాడిలా వచ్చాడు... మీరిచ్చిన లక్షా...

రాఘవ : పట్టుకుపోయాడా ...

( ఇంతలో ఇందిర వచ్చింది )

ఇందిర : ఏంటండి... ఏమైంది...ఇల్లంతా గజిబిజిగా వుందేంటి...

విశ్వ : దొంగపడ్డ ఇల్లు, దగా పడ్డ మనిషి ఎప్పుడూ ఇలాగే వుంటారు...

ఇందిర : దొంగపడ్డాడా... ఏవన్నా పోయాయా...

విశ్వ : ఏం కంగారు పడకమ్మా ...మీవారికి దాచిపెట్టమని ఇచ్చిన లక్షా పట్టుకుపోయాట్ట...

ఇందిర : లక్షా! ఓరి దేవుడో .... ఎంత పని జరిగిందిరోయ్...అయినా చూస్తూ మీరెలా వూరుకున్నారండి....

మూర్తి : ఆ ... చూస్తూ వూరుకోవడమా... నువ్వు చూల్లేదుగానీ వాడిపైకి యాక్షన్ హీరోలాగా ఎగబడి ఫైట్ చేస్తే కత్తి చూపించి కుర్చీకి కట్టి పారేశాడు... చూడు జుట్టుపీకి దవడ పగలకొట్టాడు...

విశ్వ : అలా జరగటానికి వీల్లేదే !

రాఘవ : వాడితో ఫైటింగులు గట్రా దేనికయ్యా ! యాభై ఇచ్చి యాభై పట్టుకు పోమ్మంటే పోయేది...

హను : మరే ! పాతికిచ్చినా అదో పద్ధతిగా వుండేది...

ఇందిర : ఇప్పుడేం చేద్దాం అండి... పోలీసులకి ఫోన్ చేయండి...

విశ్వ : ఆగండి... ఏం వద్దు... చూడండి... అక్కడి మన పిల్లలు ప్రేమించుకున్నారు... ఓకే... తప్పుకాదు... మనసులు కలిసి వాళ్ళిద్దరూ ఒకటయ్యారు...వాళ్ళిద్దరి పేరెంట్సుగా రెండు ఫ్యామ్లీస్ కల్సి ఒకటవ్వాలి... అంతే దాపరికాలు లేకుండా అన్నీ విషయాలు మాట్లాడుకోవాలి...మీరు మీ గురించి నాకు అన్ని విషయాలు చెప్పారా !

మూర్తి : లేదు... నిజాలు తెలిస్తే ఎక్కడ ఈ పెళ్ళి ఆపేస్తారో అని భయపడి దాచిపెట్టా !

రాఘవ : సార్ అన్ని విషయాలు ఎంక్వైరీ చేసి కనుక్కున్నారు...

విశ్వ : ఇప్పుడు నేను ఈ లక్షా మీరే నొక్కేసారిన ప్రచారం చేసి పెళ్ళి ఆపేయచ్చు ఏమంటారు....

ఇందిర : అంతమాట అనకండి అన్నయ్యగారు... ఒక్క పిల్ల, మమ్మల్ని శిక్షించండి... కాని పెళ్ళి మాత్రం ఆపకండి....

మూర్తి : అవునండి...  నా చేతకానితనానికి నా బిడ్డ బతుకు బలిచేయకండి...

విశ్వ : ఓకే...మీ తప్పు మీరు తెల్సుకున్నారు కాబట్టి  మీకో  గుడ్ న్యూస్... నీకిచ్చిన  ఆ
బ్రీఫ్‌కేసులో డబ్బు లేదు...  వొట్టి చిత్తు కాగితాలు తప్ప....

ఇందిర : ఆ నిజంగానా.... హమ్మయ్య ఎంతటి చల్లని మాట చెప్పారు...

మూర్తి : కాని వాడు  పోతూ పోతూ లక్షదొరికింది అన్నాడేమిటి ?

విశ్వ : అదంతా బిల్డప్పు...నిన్ను అదరగొట్టడానికి ...

ఇందిర : మీ పెట్టెలో డబ్బులేవా... లక్షదొరికిందని దొంగవాడన్నాడా...అంటే ఓరిదేముడే...
( లోపలికి పరిగెత్తింది )

విశ్వ : మేనేజర్ ఎందుకావిడలా కంగారు పడుతోంది...

రాఘవ : నేనూ మీ లాంటి పాత్రనే ...మీ పక్కనేమన్నా .... ఎలా తెలుస్తుంది...
( ఇందిర తిరగొచ్చింది..బోరుమని ఏడుస్తోంది )

ఇందిర : దేముడో ఘోరం జరిగిపోయిందండీ...ఆ దొంగ చచ్చినాడు...పొద్దున నేను
బ్యాంక్‌నుంచి తెచ్చిన దాచిన డబ్బు లక్షా పట్టుకుపోయాడండీ...

మూర్తి : లక్ష్మీ... మనడబ్బులా...

హను : ఏంటమ్మా నిజమా... సరిగ్గా చూడు...
( హనుమంతరావు లోపలికి వెళ్ళాడు )

విశ్వ : మీ డబ్బు లక్ష పట్టుకుపోయాడా...అలా జరగడానికి వీల్లేదే !

ఇందిర : డబ్బులే కాదండి... నా నెక్లెస్సు...జతగాజులు వాడిదినం బెట్ట...

విశ్వ : క్యాష్ కాకుండా గోల్డ్ కూడానా ...అలాజరగడానికి వీల్లేదే!

ఇందిర : అలా చూస్తూ నిల్చుంటారేంటండి... పోలీసులకి ఫోన్ చేయండి....

విశ్వ : వొద్దు...అమ్మా మీరు బాధపడకండి... మీ డబ్బులు, నగలు ఎక్కడికి పోవు...  నే
హామి... ఆ దొంగ ఎవడో కాదు నే ఏర్పాటు చేసిన మనిషే ...మేనేజర్...

రాఘవ : సార్...

విశ్వ : ఆ కుర్రాడికి ఫోన్ చేసి పట్టికెళ్ళిన క్యాష్, నగలు తీసుకుని వెంటనే రమ్మను...

రాఘవ : యస్సార్!

ఇందిర : ఆ దొంగ మీ మనిషా...

విశ్వ :అవునమ్మా... ఒక్క పిల్లాడికి పరువుగల కుటుంబం పిల్లనిచ్చి పెళ్ళి చెయ్యాలని మీ
మనస్తత్వాలు ఎలాంటివో  టెస్టు చెయ్యడానికి  నేనే ఈ డ్రామా  ఆడించా...మనిషికి

( డబ్బు, కార్లు, మేడలు కాదమ్మా ముఖ్యం...నీతి, నిజాయితీ సంస్కారం ముఖ్యం...
మీరు నాకు నచ్చారు...మేనేజర్....

రాఘవ : సార్ కథ అడ్డం తిరిగింది.
మీరు పూరమాయించిన ఆ దొంగ అసలు రాలేదట.. ట్రాఫిక్ జామ్‌లో ఇరుక్కుపోయాట్ట... సారీ చెప్పమన్నాడు...

విశ్వ : వ్వాట్ ! నిజమా !

ఇందిర : ఓరి నాయనో.... అంటే ఆ వచ్చింది అసలు దొంగా !

మూర్తి : మై గాడ్ ! నిజమా...

ఇందిర : కడుపుకట్టుకుని కూడబెట్టానండి... ఎంత పని జరిగింది... వాడి చేతులు విరిగిపోను... ( మూర్తి కుర్చీలో కూలబడి రెండు చేతులు నెత్తిన పెట్టుకుని కూర్చున్నాడు...ఇందిర ఏడూస్తూనే వుంది )

విశ్వ : మేనేజర్...

రాఘవ : యస్సార్....

విశ్వ : ఏవన్నావ్... ఆ వచ్చింది అసలు దొంగా...అంటే సొమ్ము నిజంగా పోయినట్టేగా...

రాఘవ : యస్సార్....

విశ్వ : అలా జరగడానికి వీల్లేదే !

----- ఫ్రీజ్ -----

----- తెర -----